


# చెట్టుక్రింద చినుకులు

సత్యం మందపాటి

సంధ్యా సమయంలోని ఆకాశం క్రొత్త పెళ్ళికూతురు ఎత్తైన నున్నటి బుగమీద నును సిగ్గులా అరుణారిమలు సంతరించుకుంటున్నది.

అప్పుడే ఉదయిస్తున్న బాలభానుడి మెత్తటికిరణాలు శోభనంనాటి కన్నెపిల్ల కళ్ళలోని మన్మధ బాణాలా వున్నాయి.

ముప్ఫయి మంది మనుషులతో గుంటూరు నుంచి ఊళ్ళకు బయలేదిన ఆర్. టి. సి. బస్సు మొదటి కాన్పుకు పుట్టింటికి వచ్చిన గర్భిణీ స్త్రీలా వుంది.

ముగ్గురు పిల్లల్ని కనగానే యిక వద్దని అడ్డుపడే ఫామిలీ ప్లానింగ్ వారిలా బస్సుకు అడ్డంగా నిలబడి

కుడి ఎడమైతే పొరపాటే లేదు. ఎడమ కుడైతే తప్పూ లేదు. పోలీసు దొంగకు ఎప్పుడూ అవినా భావసంబంధం వుండి తీరుతుంది—ఇద్దరూ చెరొక చేతికి బేడీలు తగిలించుకున్నపుడు.

అవమని చేయి పైకెత్తాడు పోలీస్ కాని స్టేబుల్ ఆశీర్వాదం.

అప్పుడే పుట్టిన పసిపిల్లలా కీచుమని అగింది ఆర్. టి పి. బస్సు.

పోలీస్ కానిస్టేబుల్ ఆశీర్వాదం చేతికి బేడీలు వేసివున్నాయి.

పోలీస్ చేతికి బేడీలు ఏమిటని ఆశ్చర్య పోనక్కరలేదు—ఆశీర్వాదం బేడీలు ఒక ప్రక్క తన కుడి చేతికి తగిలించుకుని, రెండో ప్రక్క కె. డి. నరిసిగాడి ఎడమ చేతికి తగిలించాడు.

"వారంటిదిగో" అన్నాడు ఆశీర్వాదం కండక్టరుతో.

"చిల్లర లేదు!" అలవాటుగా అన బోయిన కండక్టరు నాలిక కొరుక్కున్నాడు ప్రొద్దున్నే—

"రైట్. రైట్" అంటూనే టింగ్-టింగ్ మంటూ గంట మ్రోగించాడు.

"చ్మి చ్మి" అని రెండుసార్లు తుమ్మి బయలేరింది ఆర్. టి. పి బస్సు.

గేర్లు గరగర మంటుంటే, క్లచ్ కర కర మంది.

ముగ్గురు కూర్చునే సీట్లో కూర్చు న్నారు పోలీసు దొంగా ప్రక్క ప్రక్కనే. సోషలిజంకి ఇంతకన్నా మంచి ఉదాహరణ దొరకదు.

కునికిపాట్లు పడుతున్న నల్లటితను ప్రక్కన కూర్చున్న దొంగను చూసి ఉలిక్కిపడి-వాళ్ళని ప్రక్కకి జరగమని యిటు వచ్చి తను పోలీసు ప్రక్కన కూర్చుని-కునికిపాట్లు కంటిన్యూ చేస్తు న్నాడు.

కునికిపాట్లు పడుతూనే, బస్సు ఏమీ కుదుపుల్లేకుండా రోడ్డు మీద నడవటం గమనించి—మునిసిపల్ లిమిట్స్ దాటి నట్టున్నాం- అనుకున్నాడు-అనుకుంటూనే పోలీసు భుజం మీద తల ఆనించి-చిన్నగా గుర్రు పెట్టాడు కూడాను,

వెనక సీట్లో కూర్చున్న తిరుపతి వెంకటేశ్వర్లు. ఒకసారి గుండు సర్దుకుని ఈ పోలీసూ. ఆ పోలీసూ ఒకటే అను కున్నాడు. ఆ రోజు రాత్రి తను భార్యకి నలతగా ఉంటే సైకిలెక్కి ఏమీ గమ నించకుండా త్రొక్కుతున్నాడేమో. కాని స్టేబుల్ ఆశీర్వాదం చటుక్కున తనని పట్టుకోగానే చమట పట్టింది.

"లైటేది!" అడిగాడు.

"ఉందాలే-లేదా!" ఆశ్చర్యపోయాడు.

తలపంకించాడు ఆశీర్వాదం. మీలాటి వాళ్ళని చాల మందిని చూశాం అన్న ట్టుగా—

"స్టేషన్‌కి రండి!" అన్నాడు సైకిలు తీసుకు వెడుతూ—

"లైటు వెలిగించే వుంచాను-కాని సైకిల్‌కి తగిలించటం మరచి పోయాను-తెస్తాను నా సైకిలిచ్చేయ్యండి" బతిమి లాడాడు.



ఆశీర్వాదం నవ్వాడు.

"రేపు కోర్టులో చెప్పుకోండి అవన్నీ— పైన తగ్గిస్తారు యింట్లో లైటు మరచి పోయానంటే."

మళ్ళీ నవ్వాడు ఆశీర్వాదం.

తిరుపతి వెంకటేశ్వర్లు చాల క్విక్‌గా ఆలోచించాడు.

చటుక్కున జేబులోనుంచి పావలా

తీసి "కాఫీత్రాగండిసార్!" అని చేతిలో వుంచబోయాడు.

ఆశీర్వాదం అదోలా చూశాడు వెంకటేశ్వర్లని. "లంచం యిస్తావా-నే నలాటి వాడిని కాదు!" అని దానిభావమేమో అనుకున్నాడు వెంకటేశ్వర్లు.

"రేపు కోర్టులో ఏపది రూపాయలో ఫైన్ వేస్తే తెలుస్తుంది-పావలా ఇస్తున్నాడు పెద్ద మనిషి!" గాలితో మాట్లాడుతున్నాడు ఆశీర్వాదం. వెంకటేశ్వర్లకిగాలి ధూళి మీద నమ్మకం వుంది.

వెంటనే "ఇది వుంచండి సార్" అన్నాడు వెంకటేశ్వర్లు - ఆశీర్వాదం చేతిలో రెండు రూపాయల నోటు వుంచి.

పరులసొమ్ము పాము వంటిది అనే నమ్మకం గల ఆశీర్వాదం వెంటనే వెంకటేశ్వర్లు సైకిల్‌ను వదిలేశాడు. రెండు రూపాయల నోటు కాకీ నిక్కర్‌లోకి తోసేస్తూ - "ఇంకెప్పుడూ లైటులేకుండా వెళ్ళకు!" అన్నాడు.

వెంకటేశ్వర్లు వెళ్ళటానికి సిద్ధపడి సైకిలెక్కబోయి, జేబులో యింకో రెండు రూపాయలనోటు లేదని గుర్తు తెచ్చుకుని, కనుచూపు మేర దాకా సైకిల్ని నడిపించుకుని వెళ్ళాడు.

యింకోసారి గుండు సర్దుకుని ఈ పోలీసూ, ఆ పోలీసూ ఒకడే అనుకున్నాడు మళ్ళీ.

ఏపుగా పెరిగిన పచ్చటి పొలాలు అందమైన కన్నెపిల్ల యవ్వనంలా విరగబడుతున్నాయి.

ప్రక్కనే వున్న పంటకాలువ లేత పెదవుల అందమైన చిన్నదాని తియ్యటి నవ్వులా గలగల పారుతున్నది

"ఈ వచ్చినాడు యింకా సుఖంగానే వున్నాడా!" ఆడవాళ్ళకి ప్రత్యేకించిన ముందు సీటు మగాళ్ళకి వదిలేసి వెనక మగాళ్ళ సీటులో కూర్చున్న రత్తమ్మ అనుకుంటున్నది.

"ఒక వీసెడు వంకాయ లియ్యవే!" అనేవాడు ప్రతిరోజూ ఆశీర్వాదం.

"లేవు!" అన్నది మొదటి రోజు రత్తమ్మ.


"స్టేషన్‌కి పడు-రోడ్డు మీద అడ్డంగా కూర్చుని కూరలమ్ము తున్నావ్-నీ బాబు సొమ్ములాగా——"

రోషం వచ్చింది రత్తమ్మకు "పదు" అంది లేస్తూ.

"వెర్రి మొఖమా బుర్రలేని నాయాలా!" రంగయ్య ఆశీర్వాదం చేతిలో ఓ అర్ధ రూపాయి వుంచి-అన్నాడు రత్తమ్మతో.

"కొత్త గిత్త గదరా-ఎగిరెగిరి పడుతున్నది" అన్నాడు ఆశీర్వాదం-రంగయ్యతో.

రంగయ్య, రత్తమ్మ చెవిలో జ్ఞానోపదేశం చేశాడు - రంగయ్యా వాళ్ళకు శ్రీకృష్ణుడు కులదైవం.




రత్తమ్మ మరి నోరెత్తకుండా-పీశెడు వంకాయలు భక్తి పూర్వకంగా ఇచ్చింది ఆశీర్వాదానికి-మనసులో తిట్టుకుంటూ.

ఆశీర్వాదం ఆశీర్వాద ఫలితంగా రోజూ ఆశీర్వాదానికో - అనుమానంకో దక్షిణ యివ్వటం అలవాటు చేసుకున్నది.

"పాపిష్టి సొమ్ముతో ఎట్లా వుంటున్నాడో!" అనుకుంది రత్తమ్మ.

ఆశీర్వాదం ఆలోచిస్తున్నాడు. పెద్ద పిల్లాడికి ఉద్యోగం యిప్పించమంటే అయిదొందలు లంచం అడిగాడు ఆ ఆఫీసర్, చాలీ చాలని తన జీతంతో ఎన్నాని చూసుకుంటాడు. ఆ అయిదు వందలూ ఎలాగా సంపాదించటం అనే ఆలోచిస్తున్నాడు.

చాలా రోజుల తర్వాత పుట్టింటికివచ్చిన ఆడపడుచులా ఆనందంగా పొన్నూరు డిపోలో ఆగింది ఆర్ టి సి బస్సు. అందుకో అక్కడ ఆగిన బస్సులు తొందరగా కదలవు.

"పదిహేను నిమిషాలు ఆగుతుంది సార్. కాఫీ టిఫిన్‌కి టైముంది సార్ - దిగండిసార్!" అరుస్తున్నాడు అక్కడి కాంటీన్‌కి సంబంధించిన ఒక మనిషి.

డ్రైవరూ, కండక్టరూ అప్పటికే ఇడ్లీ సాంబార్‌లో పడ్డారు.

పండగకి అత్తగారింటికి వెడుతున్న కళ్ళకోడు చిన్నవాడు కొత్త పెళ్ళాం కళ్ళ (జోడు) ముందు కదలాడింది కాబోలు -

'బయల్దేరి గంట కాలేదు అప్పుడే కాఫీనా? గంటకు వందమైళ్ళు పోయే బస్సులు వస్తేగాని భారతదేశం బాగుపడదు' అనుకుంటున్నాడు.

టెర్లిన్ పాంటు కుర్రాడు ఆంధ్ర పత్రిక కొనుక్కొచ్చి అందులో 'ఫలానా డబ్బు గల ఆయన యింటి మీద యిన్‌కమ్ టాక్స్ అధికారుల దాడి' చదివి ''ఇందిరాగాంధీ-శక్తి-శక్తి కదండీ ఆడదని పేరేగాని-యిక కొన్నాళ్ళలో అమెరికాలో లాగానే మనదేశంలో కూడా బీద వాళ్ళుండరు!'' అంటున్నాడు.

ఇన్‌కమ్ టాక్స్ అధికారులదాడి అన్న మాట వినగానే వులిక్కిపడ్డ ఖద్దరు లాల్చీ ఆ మాట మరచిపోవటానికి ప్రయత్నం చేస్తూ ''మా బావమరిది అమెరికాలో నేగా ఉన్నది. అక్కడ బీదవాళ్ళే కాదు-ముష్టి వాళ్లు [illegible]గా వున్నారట!'' అన్నాడు-అపోజిషన్ లీడర్‌లా పోజు పెట్టి.

డిపో ముందరె తారురోడ్డు - సవరం పెట్టుకునే అవసరం లేని పడుచుపిల్ల - పొడుగాటి జడలా నల్లగా నిగనిగ లాడుతున్నది.

ఆకాశంలోని మబ్బులు ప్రియురాలి గుండ్రటి నున్నటి శరీరం మీద జార్జెట్ చీరలా మెత్తగా జారుతున్నాయి.

కండక్టరూ, డ్రైవరూ బస్సు ఎక్కటం చూసి, 'ఐయామ్ కమింగ్ డార్లింగ్, మై స్వీటీ' కళ్ళు మూసుకుని తన్మయత్వం అనుభవించాడు - అత్తారింటికి పోతున్న కళ్ళజోడు చిన్నవాడు

కే. డీ నరిసిగాడు ఆలోచిస్తున్నాడు - తన పెళ్ళాం, ఆరుగురు పిల్లలూ మళ్ళీ ఎలా గడుపుతారో ఈ నాలుగు నెలలూ - ప్రతిసారీ వాళ్ళ ఆకలిచూడలేకా, ఎండ వానలకి ఏమీ అభ్యంతరం చెప్పని ఆ గుడిసెలో వుండలేకా. ఫాషన్ల పేరుతో డబ్బున్నవాళ్ళు కప్పుకోకుండా వదిలేసే శరీర భాగాలను కప్పుకోటానికి గుడ్డల్లేక సిగ్గుపడే తన భార్య ముఖంలోకి చూడలేకా, తను తనకి చాతనయిన దొంగతనం చెయ్యటం పోలీసులకి దొరకటం మామూలయి పోయింది. ఒకసారి జైలుకి వెళ్ళిన వాడు మంచి మనిషిగా మారినా దొంగ వెధవ క్రిందే లెఖ్ఖ- అందుకే తను ఆఖరికి సైకిల్ షాపులో గాలి కొట్టటానికి కూడా పనికిరావటంలేదు. అందుకే జేబులు కొడుతున్నాడు. ఎప్పటికి మారుతుందీ జీవన సరళి.

కుడి భుజంమీద దురదపుట్టి ఎడమ చేత్తో గోక్కుంటున్నాడు కే. డీ నరిసిగాడు. అతని ఎడమచేతికి తన కుడిచేతికీ కలిసి బేడీలు వుండటంవల్ల నవ్వుకుంటూ తన కుడిచేతిని ఎత్తి అతనికి వీలుగా వుంచాడు ఆశీర్వాదం

నరిసిగాడు నవ్వాడు అర్ధవంతంగా.

''మనిద్దరికీ బేడీలు వున్నాయి సార్, కాపోతే నేను దొంగని మీరు పోలీసు.',

"నోర్మూయ్!" అన్నాడు ఆశీర్వాదం.

ముందు సీట్లో కూర్చున్న హిమాంబీ చటుక్కున వెనక్కి తిరిగి చూసింది

"మళ్ళీ జైలు కెడుతున్నావా నర్సీ." అనబోయి వాడు యింకా ఏదన్నా అవి పది మందిలో తన పరువు తీస్తాడేమొ అనుకుని వూరుకున్నది హిమాంబీ.

కాని గారపళ్ళు బయటపెట్టి 'ఏం మామా-బాగుండా వా-ఈ మధ్య దరిసి నాలేం లేవు' అన్నది ఆశీర్వాదంతో.

ఆశీర్వాదం మాట్లాడలేదు. ఒకసారి చుట్టూ చూసి "నోర్మయ్యవే" అన్నాడు నెమ్మదిగా.

మూతి ముడుచుకుని ముందుకు తిరిగింది హిమాంబీ.

ఎన్నిసార్లు తన సొమ్ము తిన్నాడో ఆశీర్వాదం.

కరువులూ, కష్టూ, రోగాలూ, రొష్టూ అన్నీ భరించి అందర్నీ భరించి అంతా అర్పించి-తనేదో సంపాదించుకుంటుంటే ఆ సంపాదన డాక్టర్లకీ, పోలీసులకే చాలటం లేదు. యికనేం తింటుంది. అసలు వీళ్ళకోసమేనా తన సంపాదన అనిపిస్తుంటుంది అప్పుడప్పుడూ—

ఆ రోజు రాత్రి బాగా గుర్తుంది. పక్కవూరి ప్రెసిడెంటుగారు తనతో వున్నారు. అప్పుడే తలుపులు దబదబా బాదాడు ఆశీర్వాదం.

పదుకి ప్రెసిడెంటయినా ఆయన పరువు గజగజా వణికింది. ఆయనకిలాటివి అలవాటు లేదుట. యిలాటివంటే-అసలు అని కాదు-దొంగచాటుగా అవి.

హిమాంబీకి మామూలే-భయపడాల్సిన విషయమేం కాదు. కాకపోతే కొంత అర్చు.

తలుపు సగం తెరిచి తల బయటకు పెట్టింది.

"అడ్డులేవ్వే ... లోపల ఎవరూ...." అన్నాడు ఆశీర్వాదం రీవిగా కర్ర తిప్పిం.

"ఎందుకూ నీ మామూలు నీ కిస్తానుగా లోపల ఎవడుంటే నీకేం!" అన్నది బింకంగా.

❊ ది పేయిన్

మానసికవేత్త: ఇంతకీ మీ బాధకు కారణం?

మానసిక రోగి: మా అమ్మాయి సంగీతంతోనూ. మా ఆవిడ సాహిత్యంతోనూ నన్ను బాధిస్తున్నారు.

—వెలిచేటి శ్రీనివాసరావు. కాకినాడ-2

నవ్వాడు ఆశీర్వాదం.

"అదిగాదే పిచ్చి నాయాలా-దొరబా బయితే అక్కడ కూడా కాస్త...."

"నా కిష్టం లేదు!" అన్నది మరీ బింకంగా.

"అయితే వదుస్టేషన్‌కి!" తలుపు తోసుకు పోబోయాడు.

ప్రెసిడెంటుగారు హిమాంబీని కేకే శాడు-అతన్నక్కడే వుండమని చెప్పి లోపలకు వెళ్ళింది.

వెంటనే బయటకు వచ్చి రెండుపదులు అతని చేతిలో పెట్టి "ఆయన యిమ్మ న్నాడు!" అన్నది

ఆశీర్వాదం నోట్లు అందుకున్నాడు.

"మరి నీ వాటా?" అడిగాడు.

ఇంకో రెండు రూపాయలు చేతిలో పెటింది.

"యింకా ఎంతసేపు వుంటాడు!" అడిగారు.

అదోలా చూపింది హిమాంబీ— "ఇంకా ఏం వుంటాడు-హడల గొట్టా వుగా బయలు దేరటానికి సిద్ధంగా ఉన్నాడు!"

"సరే నువ్వు సిద్ధంగా వుండు-పది నిమిషాల్లో వస్తాను."

ఆశీర్వాదం నాలుగిళ్ళవతల మాణిక్యం యింటి తలుపు తడుతున్నాడు

ప్రెసిడెంటు వెళ్ళిన అయిదు నిమిషా లకి వచ్చాడు ఆశీర్వాదం.

"డబ్బు లిచ్చావుగా!" అన్నది హిమాంబీ.

"ఇస్తే—" అంటూ తలుపు వేశాడు ఆశీర్వాదం.

హిమాంబీ వళ్ళి ఒకసారి తనలో తనే సణుక్కొని కిటికీలోనుంచి బయటకు చూస్తున్నది.

ఆశీర్వాదం ఆలోచిస్తున్నాడు. తన కూతురికి ఘనంగా పెళ్ళి చేయాలి అందరి ఆడపిల్లల లాటిదీ కాదు తన కూతురు. ఈగ వాలనివ్వకుండా అపురూపంగా పెంచాడు-కానీ కట్నం కనీసం రెండు వేలయినా యివ్వాలి ఎలా- తనదా పెద్ద సంసారం ఈ రోజుల్లో జీతం ఏ మూలకి పై సంపాదన వున్నా ఏమీ చాలటంలేదు. రోజులు గడపటానికీ యిబ్బందిగా వుంది మరి పెళ్ళి ఎలా చేస్తాడు?

"సోడా సోడా-నిమ్మకాయ సోడా-"

"వేయించిన పప్పు-వేరు శనగపప్పు"

"ఎవరి కండీ-జీడి పప్పు"

"దవనం—మరువం."

"బాపట్ల దిగండి సార్—అరె ఏమిటది ముందు దిగేవాళ్ళని దిగనివ్వండీ అలా తోసుకుంటే ఎలా ఏమిటమ్మా, ఆడదానివి గదా నువ్వు కూడా అలా-చాలసేపు ఆగు తుందయ్యా ఎందుకంత తొందర-చీరాలకు టిక్కెట్టా చిల్లరలేదు - తెచ్చుకో-అవును— లేదు మేంమాత్రం ఎంత మందికవిఇస్తాం

దేశంలో చిల్లర కొరత ఉందని తెలీదూ మీకు పదిహేను పైసలు యివ్వాలా — దిగండి యిస్తాను. పదిపైసలు వుంటే యివ్వండి. పావలా యిస్తాను. లేదా అయితే లేదు. అవును లేదండీ నన్నేం చేయమంటారు?''

"దిగవయ్యా పదిహేను పైసలకోసం పాతికమందిని ఆపావు!''

"మీకేమండీ-పదిహేను పైసలు నాకు కదా రావలసింది. తనది కాకపోతే. ఏమండీ కానిస్టేబుల్‌గారూ మీరుచెప్పండి '

"ఉండవయ్యా ఈ దొంగ వెధవ ఎక్కడ పారిపోతాడో అని నే చస్తుంటే'' జనాన్ని త్రోసుకుంటూ బస్సు దిగుతున్న ఆశీర్వాదం విసుక్కున్నాడు.

"చీరాల ఒకటి!'' జేబులో చేయి పెట్టగానే ''పర్సు—నా పర్సు ఎవడో దొంగ వెధవ కొట్టేశాడు! పట్టుకోండి'' అరిచాడు పిల్కచొక్కా ఆయన.

"జాగ్రత్తగా వుండవద్దుటండీ ఎవరన్ని అడుగుతాం యిప్పుడు.''

"అరవై రూపాయల దాకా వున్నయ్యండి-అందర్నీ వెతకండి-తన్నండి-ఆ దొంగెవరో కనుక్కొని.''

"యిప్పుడే కదండీ—పోలీసతను ఒక దొంగను తీసుకెడుతున్నది ఆ వెధవే...''

"ఛ-ఒక చేతికి బేడీలు వుండగా. మళ్ళీ దొంగతనం చేస్తాడా వాడు!''

అందులో ప్రక్కనే పోలీసు కూడా వున్నాడు''

"ఏమో-ఏం చెబుతాం ఈ రోజుల్లో-వాళ్ళిద్దరికీ వాటాలున్నా వుండవచ్చు—''

"ఛ-అలా అయివుండదు లేండి—యిక్కడే ఎవరో.''

"తన్నండయ్యా-ఎవడు తీశాడో కనుక్కొని...''

అంతా గోలగా వుంది.

అ త్తారింటికి పోయే కళ్ళజోడు చిన్నవాడు వూరు చేరేంతదా అన్న హుంషారులో ఈలవేశాడు పెళ్ళాన్ని చేరబోయే ఉత్సాహంలో ముందుకు అడుగు వేశాడు కొత్త జంటని ఆశీర్వదించటానికా అన్నట్టు హఠాత్తుగా పెద్ద వానపడింది.

గబగబా పరుగెత్తి ప్రక్కనే వున్న చెట్టు క్రింద తలదాచు కున్నాడు.

దూరాన బస్సు దగ్గర - దొంగతనం చేశాడనే నెపంమీద ఎవరో ముష్టి వెధవని పట్టుకుని సినిమా హీరోల్లా తంతున్నారంతా. కాని వాడి దగ్గర డబ్బు దొరకలేదు-వాడు ఏడుస్తున్నాడు.

వాన బాగా పడుతున్నది.

చెట్టుక్రింద తనతోపాటు బేడీలు వేయికున్న పోలీసూ, దొంగా కూడా తలదాచుకుంటున్నారు. ఏదో చెప్పుకుని నవ్వుకుంటున్నారు.

వానపడకుండా ఏదో రక్షణ యిస్తుందని. చెట్టు క్రింద చేరితే చెట్టు గాలికి అటూ, ఇటూ వూగటం వల్ల బయటపడే చినుకులకన్నా ఎక్కువే పడుతున్నాయి చెట్టుక్రింద చినుకులు.